## క్లుప్తంగా

### శ్రీ వాసవీ కన్యకాంబకు ఘనంగా పూజలు

**కడప కల్చరల్ :** ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవికి శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని రెండు రోజుల ఉత్సవాలలో భాగంగా తొలిరోజు ఉదయం ఎంపిక చేసిన కన్యకలకు మంగళస్నానం ఆచరింపజేసి వాసవీ దీక్షను ప్రారంభించారు. వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో దీక్షధారులతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దీక్షలో ఉన్న కన్యకలు శనివారం ఉదయం 6 గంటలకు శ్రీ పాండురంగస్వామి ఆలయం వద్ద నుంచి మొత్తం 102 మంది భక్తులతో క్షీర కలశాల సహితంగా ఊరేగింపుగా కన్యకాంబ ఆలయానికి చేరుకోనున్నారు. ఈ ఉత్సవాలు ఆదివారం కూడా కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### 20న పాలేటి గంగమ్మ తిరునాల


పూజలందుకుంటున్న మంచాలమ్మ

**కమలాపురం :** మండల పరిధిలోని టి.చదిపిరాళ్ల–గొల్లపల్లె గ్రామాల మధ్య వెలసిన శ్రీ పాలేటి గంగమ్మ(మంచాలమ్మ) తిరుణాల మహోత్సవాన్ని ఈనెల 20వ తేదీన వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం మహా గణపతి పూజ, ప్రధాన కళశ స్థాపన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే అన్నదానం నిర్వహిస్తున్నామని, సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు. అలాగే తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని పాల పళ్ల ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన ఎడ్ల యజమానులు ఆలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు.

### నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తాం

**కమలాపురం :** ఎన్నికల విషయంలో ఎవరైన గొడవలు సృష్టించినా, ఘర్షణలకు పాల్పడిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల అనంతరం వాటి గురించి పంతాలకు పోయి ఘర్షణలకు పాల్పడినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. గొడవలకు దిగిన వారు ఎంతటి వారైన వారిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పెట్టి జైలుకు తరలిస్తామన్నారు. అలాగే వారిపై రౌడీ షీట్స్ ఓపెన్ చేసి, గ్రామ బహిష్కరణ చేపడతామన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై, గ్రూప్ అడ్మిన్‌లపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైన సమస్యలుంటే మీరు గొడవలకు దిగవద్దని, పోలీసుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

### అశ్రద్ధ చేస్తే ప్రమాదం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**బద్వేలు అర్బన్ :** అధిక రక్తపోటును అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ప్రమాదం అని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జోత్స్నస్వర్ణలత పేర్కొన్నారు. తొట్టిగారిపల్లెలో అధిక రక్తపోటు వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, జీవనశైలి, మానసిక ఒత్తిడి, ఊబకాయం, ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వంటి కారణాలతో హైబీపీ వస్తుందని అన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్సతో అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సీహెచ్‌ఓ చంద్రావతి, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### బాడీ ఫ్రీజర్ వాహనం ప్రారంభం

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని బుల్లెట్ బాబు సేవలు వెలకట్టలేనివని అబ్దుల్ మౌలానా పేర్కొన్నారు. శుక్రవారం పులివెందులలో బుల్లెట్ బాబు తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన బాడీఫ్రీజర్ వాహనాన్ని మత పెద్దలతో కలిసి ఆయన ప్రారంభించారు. బుల్లెట్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా ఎవరికైనా అంతిమయాత్ర కోసం వాహనంతో పాటు బాడీ ఫ్రీజర్‌ను వాడుకోవచ్చున్నారు. ఈ వాహనాన్ని వినియోగించుకోదలిచిన వారు సహాయం కొరకు 9502788074, 8125990353 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# క్రికెట్.. జోష్..!

- రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ
- రాణిస్తున్న క్రీడాకారులు
- వేసవి శిబిరాలకు విశేష స్పందన


బ్యాటింగ్‌లో మెలుకువలు నేర్పుతున్న శిక్షకుడు


ఫిట్‌నెస్‌పై శిక్షణ ఇస్తున్న ఏసీఏ ట్రైనర్

**క్రికెట్... క్రికెట్.. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరినోటా.. వినిపించే అత్యంత ఆదరణ ఉన్న క్రీడ క్రికెట్. ప్రపంచవ్యాప్తంగా.. ముఖ్యంగా మనదేశంలో క్రికెట్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతాకాదు. అటువంటి క్రికెట్ క్రీడలో మెలుకువలు నేర్పే శిక్షణ శిబిరం జిల్లా వ్యాప్తంగా నాలుగు కేంద్రాల్లో నిర్వహిస్తుండటంతో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా శిక్షణలో పాలుపంచుకుంటున్నారు.**

**కడప స్పోర్ట్స్ :** కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) ఆధ్వర్యంలో మే నెల 1 నుంచి క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభమైంది. కడపతో పాటు నందలూరు, ప్రొద్దుటూరు, బ్రహ్మంగారి మఠం సబ్ సెంటర్‌లో కూడా శిక్షణ ఇస్తున్నారు. నిపుణులైన కోచ్‌ల పర్యవేక్షణలో చిన్నారులకు చక్కటి శిక్షణ అందిస్తుండటంతో రెగ్యులర్‌గా వచ్చే క్రీడాకారులతో పాటు వేసవి సెలవును సద్వినియోగం చేసుకోవాలనుకునే నూతన క్రీడాకారులు కూడా ఆటలో మెలుకువలు తెలుసుకునేందుకు పెద్దసంఖ్యలో శిబిరానికి హాజరవుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. కడప నగరంలోని డీఎస్‌ఏ స్టేడియంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ కోచ్ ఎస్. ఇలియాస్, ట్రైనర్ షేక్ అబూబకర్‌ల ఆధ్వర్యంలో బాలబాలికలకు శిక్షణ కొనసాగుతోంది.

**పలు అంశాల్లో శిక్షణ**

వేసవి శిక్షణకు వస్తున్న చిన్నారులకు తొలుత ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించడంతో పాటు ఫిట్‌నెస్ ఆవశ్యకతను వివరిస్తారు. దీని కోసం చిన్నారులను మైదానం చుట్టూ పరిగెత్తించడం,


శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు

వ్యాయామం చేయిస్తారు. అనంతరం బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో మెలుకువలు వివరిస్తారు. ఫుట్‌వర్క్, స్టాండింగ్, గ్రిప్స్, రన్నింగ్, లోడింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు.

**దేశానికి ప్రాతినిథ్యం వహించడమే లక్ష్యం..**



మహిళల క్రికెట్‌లో భారతదేశ జట్టుకు ప్రాతినిథ్యం వహించడమే నా లక్ష్యం. ఇందుకోసం ప్రతిరోజూ క్రికెట్ సాధన చేసేందుకు స్టేడియంకు వస్తున్నాను. గతంలో మంగళగిరిలో నిర్వహించిన సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–15 పోటీల్లో పాల్గొన్నాను. వేసవి శిక్షణ శిబిరంలో మరిన్ని మెలుకువలు నేర్చుకుంటున్నాను.
– జి. ఐశ్వర్య, శ్రీచైతన్యస్కూల్, కడప

**మహిళా క్రికెట్‌లో అవకాశం పొందాలని..**



మహిళా క్రికెట్‌లో అవకాశం పొందాలని ఉంది. అందుకోసం శిక్షణ తీసుకునేందుకు వచ్చాను. ఫాస్ట్‌బౌలింగ్‌ను ఎంపిక చేసుకుని సాధన చేస్తున్నా. శిక్షణలో మెలుకువలు నేర్చుకుంటున్నాను. గతంలో అండర్–15 జిల్లా మహిళల జట్టుకు ప్రాతినిథ్యం వహించాను.
– పి. శ్రీవల్లి, మున్సిపల్ హైస్కూల్ మెయిన్, కడప

**శిక్షణ చక్కగా సాగుతోంది**



ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్న శిబిరానికి వస్తున్నా. కోచ్‌లు చక్కగా చెబుతూ.. తెలియని అంశాలను దగ్గరకు వచ్చి చేసి చూపుతున్నారు. క్యాంపు బాగా నిర్వహిస్తున్నారు. క్రేజీ క్రికెట్‌లో పట్టు సాధించేందుకు ఈ శిబిరం ఉపయోగపడుతుందనుకుంటున్నా. బ్యాట్స్‌ఉమన్‌గా జిల్లా జట్టుకు సేవలందిస్తాను.
– పి. హఫ్సియా సుల్తానా, క్వీన్ మేరీస్ స్కూల్, కడప

**ఆల్‌రౌండర్‌గా రాణించాలని..**



మహిళల క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా రాణించాలని ప్రతిరోజూ క్రికెట్ సాధన చేసేందుకు వస్తున్నా. నాన్న స్ఫూర్తితో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంపిక చేసుకున్నా. గతంలో ఎస్‌జీఎఫ్ అండర్–14 విభాగంలో జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించాను. సమ్మర్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుంటున్నా.
– జి. హరిణి, చెమ్ముమియాపేట జెడ్పీహైస్కూల్, కడప

## వైభవం.. ఆరాధనోత్సవం


ప్రత్యేక అలంకరణలో శ్రీఈశ్వరీదేవి

**బ్రహ్మంగారిమఠం :** కందిమల్లాయపల్లెలోని జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో జేజినాయన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రభాతసేవ, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ విశ్వకర్మ పరమేశ్వరులు, శ్రీ ఈశ్వరీదేవికి పంచామృతాభిషేకాలు, బిల్వదళార్చన పూజలు చేశారు. అనంతరం జరిగిన గుడి ఉత్సవం భక్తులను ఆకట్టుకుంది. ప్రకాశం జిల్లా చీరాలపేరాలకు చెందిన తుర్లపాటి సాంబశివరావు, పద్మావతి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం, రాత్రి నైవేద్యం, మంత్రపుష్పం, నీరాజన తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం భక్తగాన లహరి, వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. రాత్రి సింహ వాహనంపై శ్రీ ఈశ్వరీదేవి ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. వాసుదేవాపురానికి చెందిన మూలింటి చిన్న నాగిరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఆదిబ్రహ్మయ్యాచారి, కె.నాగభూషణచారి, కె.నాగవీరాచారి, కె.జనార్దనాచారి, హిందుపురానికి చెందిన కె.క్రిష్ణమాచారి, ధర్మవరానికి చెందిన యస్.శంకరాచారి సహకారంతో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్న తర్వాత భక్తులు.. స్వామి మనువరాలైన శ్రీఈశ్వరీదేవిని చిన్నమఠంలో దర్శించుకుని తరించారు.

# రక్తపోటుతో జాగ్రత్త



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

**కడప కోటిరెడ్డి సర్కిల్ :** ఉరుకులు పరుగుల జీవితం. ఇంటా బయటా తట్టుకోలేని ఒత్తిడి. వేళాపాలాలేని తిండి. ఆగ్రహావేశాలు, నిరాశ, నిస్పృహ ఫలితంగా నరాల్లో పోటెత్తే వేగం అదుపుతప్పి రేకెత్తించే అలజడి. వైద్య పనిభాషలో హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) అంటారు. బీపీ ఆదిలోనే అదుపులో పెట్టుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. లేకుంటే పెను ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని సున్నితంగా హెచ్చరించారు. మే 17న ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక వ్యాధి అయిన రక్తపోటుపై వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు.

రక్తపోటు కలిగిన వారు వ్యాధిని నియంత్రణలో ఉంచుకుంటూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ప్రశాంత్‌వర్ధన్ పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవ సందర్భంగా శుక్రవారం అర్బన్ హెల్త్ ట్రైనింగ్‌సెంటర్ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత ఆధ్వర్యంలో శిక్షణ, ర్యాలీ, ప్రతిజ్ఞ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ ప్రశాంత్‌వర్ధన్ మాట్లాడుతూ ఈ ఏడాది రక్తపోటును నియంత్రించి దీర్ఘకాలం జీవించండి అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం తెస్తున్నామని తెలిపారు. రక్తపోటు బాధితులు నిరంతరం మందులు వాడుతూ అదుపులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రసన్నలత మాట్లాడుతూ రక్తపోటు అంటువ్యాధి కాదన్నారు. విపరీతమైన తలనొప్పి, చమట పట్టడం, గుండె దడ, బరువు తక్కువగా ఉండడం, నీరసంగా ఉండడం తదితర లక్షణాలు ఉంటే వైద్యుల వద్దకు వెళ్లి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే గుండె జబ్బులు, పక్షవాతం, మూత్రపిండాల సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పండ్లు, కూరగాయలు అధికంగా తీసుకోవాలని, నూనె, కొవ్వుపదార్థాలను తగ్గించుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు లావణ్య, రవికుమార్‌రెడ్డి, హసీనాఖానమ్, ఏఎన్‌ఎం నారాయణమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### యథావిధిగా ఆర్టీసీ బస్సు సర్వీసులు

**యర్రగుంట్ల:** పట్టణంలోని రాణీవనం మీదుగా రైల్వేస్టేషన్ నాలుగురోడ్ల కూడలి వరకు ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరుగుతున్నాయని ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని ప్రొద్దుటూరు ఆర్టీసీ డీఎం మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. రాణీవనంలోని ఎస్‌బీఐ నుంచి రైల్వే బ్రిడ్జి వరకు నూతనంగా సీసీరోడ్డు వేస్తుండటంతో కొన్ని రోజులు బైపాసు రోడ్డు మీదుగా బస్సు సర్వీసులు నడిపినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం రోడ్డు పనులు పూర్తి కావడంతో బస్సులను రాణీవనం మీదుగా నడుపుతున్నామన్నారు. అయితే రోడ్డుపై ఉన్న మట్టిని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సూచనల మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మాడిశెట్టి శివ తొలగించారు.

## ముగిసిన మగ్గం రిపేరు శిక్షణా శిబిరం

**కడప కల్చరల్ :** కడప నగరానికి చెందిన దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 30 రోజుల మగ్గం రిపేరు శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసిందని సంస్థ నిర్వాహకులు ఓబుళదాస్ తెలిపారు. నాబార్డు ఆర్థికసాయంతో 30 మందికి ఈ శిబిరంలో శిక్షణ ఇచ్చామని, మగ్గం తయారీలో ఇబ్బందులను ఎదుర్కొనేందుకు పలు నైపుణ్యాలను నేర్పామని వివరించారు. ఖాజీపేటకు చెందిన అప్పనపల్లెలో చేనేత, మగ్గం నేత కార్మికులకు ఈ శిక్షణ ఇచ్చామన్నారు. గ్రామంలో దాదాపు 500 కుటుంబాలు ఈ వృత్తిపైనే జీవిస్తున్నాయని, మగ్గానికి ఏదైనా రిపేరు వస్తే మెకానిక్‌ల కోసం వారం, పదిరోజుల పాటు వేచి చూడాల్సి వస్తుందని తెలిపారు. ఈ కారణంగా వారు ఆరోజుల్లో ఉపాధి కోల్పోయి నష్టాలకు గురవుతున్నట్లు తెలిపారు. దీన్ని గమనించిన తమ సొసైటీ ప్రత్యేకంగా సర్వే నిర్వహించి వారికి అవసరమైన శిక్షణ గురించి తెలుసుకుని నిపుణులతో సంప్రదించి మగ్గాల తయారీ, మరమ్మతుల్లో శిక్షణ ఇచ్చారన్నారు. ఇందులో 30 మంది మహిళలు పాల్గొన్నారని వివరించారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం విజయ్ విహారి శిక్షణ పొందిన నేతన్నలను అభినందించారని తెలిపారు. బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కూడా పొందవచ్చని తెలిపారు. అనంతరం నాబార్డు ఏజీఎం విజయ్ విహారి శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.


శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న నాబార్డు ఏజీఎం విజయ్‌విహారి

## ఓటింగ్‌లోనూ ఆధిక్యత చాటుకున్న మహిళలు

**కమలాపురం :** నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో పాటు ఓటింగ్‌లోనూ మహిళలే ఆధిక్యత చాటుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 99,851 మంది పురుష ఓటర్లు ఉండగా 1,04,284 మహిళా ఓటర్లు ఉన్నారు. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో 83,861 మంది పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 88,528 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**185 బూత్‌లల్లో ఆధిక్యత**

కమలాపురం నియోజకవర్గలోని ఆరు మండలాల్లో 251 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. అయితే 185 బూత్‌ల్లో మహిళ ఓట్లే అధికంగా ఉన్నాయి. మిగిలిన 66 బూత్‌ల్లో పురుషులు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. కమలాపురంలో 7 బూత్‌ల్లో, చెన్నూరులో 10 బూత్‌ల్లో, వల్లూరులో 9 బూత్‌ల్లో, వీఎన్‌పల్లెలో 6 బూత్‌ల్లో, పెండ్లిమర్రిలో 20 బూత్‌ల్లో, సీకేదిన్నెలో 14 బూత్‌ల్లో పురుషుల అధికంగా ఓటు వినియోగించుకున్నారు.

**పురుష ఓటర్లు అధికంగా ఉన్న బూత్‌ల వివరాలు**

కమలాపురం మండలంలోని జె.కొత్తపల్లె(బూత్ నెం.38), జంబాపురం(39), ఎర్రగుడిపాడు(40), అప్పారావుపల్లె(49) దేవరాజుపల్లె(52), ఎల్లారెడ్డిపల్లె(53), దాదిరెడ్డిపల్లె(56) బూత్‌ల్లో పురుషులు అధికంగా ఓటు వేశారు. చెన్నూరు మండలంలో శివాల్‌పల్లె(60), చెన్నూరు పట్టణంలోని 64, 68, 70, 71, 75 బూత్‌లు, బయనపల్లె (80), ముండ్లపల్లె(88), చిన్నమాచుపల్లె(93). వల్లూరు మండలంలోని లేబాక (101), పైడికాల్వ(104, 105), కొప్పోలు (108), సి.కొత్తపల్లె(112), గోటూరు (115), టీ.జీ.పల్లె(116), అంబవరం(117), ఆదినిమ్మాయపల్లె(123) బూత్‌ల్లో పురుషులు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీఎన్‌పల్లె మండలంలో యు.వెంకటాపురం(131), కొత్తపల్లె (138), వీఎన్‌పల్లె(142), యు.రాజుపాళెం(145), గోనుమాకులపల్లె(146), ఎస్.పాలగిరి(151), తంగేడుపల్లె (154) బూత్‌ల్లో పురుషుల అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెండ్లిమర్రి మండలంలో మమ్ముసిద్దుపల్లె(156), మొయిళ్లకాల్వ(158), యారాసుపల్లె(16), ఎం.కొత్తపేట(162), చౌటపల్లె(163), నందిమండలం (164), నల్లయ్యగారిపల్లె (175), కొండూరు (176, 177), తుమ్మలూరు (179, 180), చీమలపెంట(182), పెండ్లిమర్రి(184, 185, 186), పగడాలపల్లె(187), పాతసంగటిపల్లె(188, 189), వెల్లటూరు(190), గంగపనల్లె ఎస్సీ కాలనీ(196) బూత్‌ల్లో పురుషులు అధికంగా ఓటు వేశారు.


ఓటు వేసేందుకు క్యూలో నిలిచిన మహిళా ఓటర్లు (ఫైల్)

**మిగిలిన బూత్‌ల్లో మహిళలదే పై చేయి**

సీకేదిన్నె మండలంలో బాలుపల్లె(200), అజాద్ నగర్(206), పడిగెలపల్లె (207, రసూల్‌పల్లె (208), గోపులాపురం(209), బుసిరెడ్డిపల్లె(210), అప్పరాజుపల్లె(211), సుగాలి తండా (215), ఇప్పెంట(218), పబ్బాపురం(224), ఉరుటూరు (233),మామిళ్లపల్లె(240)బూత్‌లు మినహాయించి మిగిలిన బూత్‌లలో మహిళలు ఓటు వేశారు.

**55,151 బూత్‌లలో పురుషులు–మహిళలు సమానం**

మండలంలోని 55వ బూత్‌లో మహిళలు, పురుషులు సమానంగా ఓటు వేశారు. 147 మంది మహిళలు, 147 మంది పురుషులు ఓటు వేశారు. వీఎన్‌పల్లె మండలంలోని 151 బూత్ ఎస్.పాలగిరిలో 291 మంది మహిళలు ఓటు వేయగా పురుషులు 291 మంది ఓటు వేసినట్లు అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి.

## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**కడప కల్చరల్ :** జిల్లాలోని పద్మశాలీయ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు కడప పద్మశాలీయ సేవా సంఘం అధ్యక్షులు అవ్వారు సుబ్బరాయుడు తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికిగాను పది, ఇంటర్, ఐటీఐ, ఇంజనీరింగ్, ఎంసెట్, మెడిసిన్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు తమ సంస్థ ప్రత్యేకంగా పురస్కారాలు అందజేస్తుందని తెలిపారు. పదవ తరగతిలో 500 మార్కులు, ఇంటర్మీడియేట్ బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో 900 మార్కులకుపైగా, ఆర్ట్స్ గ్రూపుల్లో 800 మార్కులకుపైగా సాధించిన విద్యార్థులతో పాటు ఐఐటీ, ఎంసెట్, ఇంజనీరింగ్, నీట్, మెడిసిన్‌లలో పట్టణ, జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన పద్మశాలీయ విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులన్నారు. విద్యార్థులు తమ మార్కుల జాబితాతోపాటు టీసీ జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఫోన్ నెంబరు, బయోడేటాతోసహా పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 10వ తేదీలోగా పద్మశాలీ భవన్ కల్యాణ మండపం, 38/166–5, చిన్నచౌకు, తిరుపతిరోడ్డు, కడప–516002 చిరునామాకు పంపాలని సూచించారు. అధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన ప్రతిభావంతులైన విద్యార్థుల జాబితాను జూన్ 12న సంఘం కార్యాలయంలో ప్రకటించడంతో పాటు అభ్యర్థులకు ఫోన్ ద్వారా తెలియజేస్తామన్నారు. అర్హులైన విద్యార్థులకు జూన్ 16 ఆదివారం ఉదయం 10 గంటలకు పద్మశాలీ భవన్ కల్యాణ మండపంలో జరిగే సభలో పద్మశాలీ సేవా సంఘం ప్రతినిధులు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు.

# సంప్రదాయ వైద్యంతో శాశ్వత పరిష్కారం

**ఎల్‌ఐసీ ఎస్‌డీఎం రవికుమార్**


శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**కడప కల్చరల్ :** సంప్రదాయ వైద్యంతో ఆరోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశముందని జీవిత బీమా సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఎల్‌ఐసీ–శాంతిగిరి ఆయుర్వేద సిద్ధ ఆసుపత్రి సంయుక్తాధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రామన్ని ప్రారంభిస్తూ ఆయన ఆధునిక వైద్యం బాగా విస్తరించిన నేటి కాలంలో కూడా ప్రాచీన వైద్య విధానాలైన ఆయుర్వేద, సిద్ధ వైద్య విధానాలు నేటికీ అనుసరణీయమన్నారు. ఆయుర్వేదం వ్యాధిని నయం చేయడంపై దృష్టి పెడితే, సిద్ధ వైద్యం ఆరోగ్యాన్ని సమకూరుస్తుందని, శారీరక వ్యవస్థ మొత్తాన్ని పునరుజ్జీవం చేస్తుందని అన్నారు. మొండి వ్యాధుల్ని, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో ఈ వైద్య విధానాల ప్రాధాన్యత అందరూ గుర్తిస్తున్నారని తెలిపారు. శాంతిగిరి ఆయుర్వేద–సిద్ధ హాస్పిటల్ బాధ్యులు, వైద్య శిబిరంలో పాల్గొన్న ఆరోగ్య నిపుణులు డాక్టర్ ఆదర్శ్ అజయ్, డాక్టర్ వందన డీఎస్ మాట్లాడుతూ వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పి, కీళ్లనొప్పి, చర్మసంబంధ సమస్యలు, జీర్ణకోశ సమస్యలు, నాడీ సంబంధిత సమస్యలకు శిబిరంలో కన్సల్టేషన్, వైద్య సేవలు అందించామన్నారు. కడప, దేవుని కడపలో ఉన్న తమ కేరళ ఆస్పత్రిలో ఇన్ పేషెంట్, వార్డ్ రూమ్‌ల సౌకర్యాలతో సంప్రదాయక పంచకర్మ వైద్యాన్ని కూడా అందిస్తున్నామని, రాష్ట్రం లోని పలు జిల్లాల నుంచి రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. శిబిరంలో 50 మందికి పైగా సేవలు అందుకున్నారు. శాంతిగిరి ఆసుపత్రి మేనేజర్ మోహనన్, సీనియర్ అసిస్టెంట్ పుష్పలత, సీనియర్ థెరపిస్టులు మను, మిథున్ సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసీ ఓఎస్ మేనేజర్ సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉచిత వైద్య శిబిరంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు, సేల్స్ మేనేజర్ సాల్మన్ రాజు, ఆనందరావు, రఘునాథ్ రెడ్డి, అవధానం శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిబిరంలో వైద్య సేవలు అందించిన శాంతిగిరి ఆసుపత్రి నిపుణులందరినీ సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్ సత్కరించారు.

## 23న దేవుని మాన్యం కౌలుకు వేలం

**గోపవరం :** మండలంలోని రాచాయపేట గ్రామంలో వెలసి ఉన్న శ్రీసోమేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి హక్కుభుక్తం కలిగిన భూములను ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు రాచాయపేటలో కౌలుకు వేలంపాట నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ బద్వేలు ఈవో సి.శివయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ముందుగా వెయ్యి రూపాయలు డిపాజిట్ రూపంలో చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు ఒక సంవత్సరానికి సంబంధించిన కౌలుగుత్త చెల్లించాలన్నారు. అలా చెల్లించని యెడల ఆ భూములను తిరిగి వేలం వేయనున్నట్లు తెలిపారు. గతంలో భూములు కౌలుకు తీసుకున్న వారు పాత బకాయిలు ఉన్నట్లయితే అలాంటి వారు పాటలో పాల్గొనకూడదన్నారు. రాచాయపేటలోని సర్వే నంబర్ 360లో 2.79 ఎకరాలు, బెడుసుపల్లెలో సర్వేనంబర్ 108లో 0.81 సెంట్లు, అలాగే చెన్నవరంలో సర్వేనంబర్ 223/1 లో 0.52 సెంట్లు, రాచాయపేటలో సర్వే నంబర్ 494లో 0.54 సెంట్లు, 550 సర్వేనంబరులో 1.46 ఎకరాలు, 559 సర్వేనంబరులో 1.10 ఎకరాలు, ఎస్.రామాపురం సర్వేనంబర్ 1595లో 0.41 సెంట్లు, టీ.సండ్రపల్లె సర్వేనంబర్ 927/2లో 0.23 సెంట్లు, రామాపురం సర్వేనంబర్ 1454/1లో 0.62 సెంట్లు సోమేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి భూములు ఉన్నాయి. ఈ భూములు కౌలు వేలానికి సంబంధించి పాట దక్కించుకున్న వారు మూడు సంవత్సరాల కాలవ్యవధి ఉంటుందన్నారు. రైతులు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

### రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించవద్దు

**బి.కోడూరు :** ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని ఎస్‌ఐ జయరాములు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని బి.కోడూరు పోలీసుస్టేషన్ ఆవరణలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ స్నేహభావంతో మెలగాలని, రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించరాదన్నారు. అసాంఘిక కార్యక్రమాలను పాల్పడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనరసారెడ్డి పాల్గొన్నారు.